విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, బుధవారం 02, నవంబర్ 2022

వైసీపీ ఎంపీ,మంత్రులు కాపులకు రాజ్యాధికారం రానివ్వరా?

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : వైకాపా లోని పాలేరు కాపు ఎమ్మెల్యే, ఎంపి, మంత్రులు కాపులకు రాజ్యాధికారం రానివ్వరా అని తాలూకా జనసేన పార్టీ నాయకులు మైలేరి మల్లయ్య ప్రశ్నించారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాజమండ్రిలో పాలేరు కాపు ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు సమావేశం ఏర్పాటు చేసి పవన్ కళ్యాణ్ కాపు జాతిని మోసం చేస్తున్నారని, పవన్ కళ్యాణ్ ముఖ్య మంత్రి పదవి కోసం కాకుండా వేరే ఎవరినో ముఖ్యమంత్రి చేయడానికి కాపులను వాడుకుం టున్నారని నోటికొచ్చినట్టు మాట్లాడారన్నారు. కాపులను బిసిల్లో చేర్చాలని ముఖ్యమంత్రిని మీరు ఎందుకు డిమాండ్ చేయడంలేదని ప్రశ్నించారు. కాపులకు 5శాతం రిజర్వేషన్స్ కోసం ప్రభుత్వాన్ని ఎందుకు మీరంతా నిలదీయడంలేదన్నారు. ప్రతీ సంవత్సరం కాపు కార్పొరేషన్‌కు 2000 కోట్లు ఇస్తానని వాగ్దానం చేసి ఇంత వరకు ఒక్క పైసా కూడా ఇవ్వని ముఖ్య మంత్రిని అడిగే దమ్ములేదా అని ప్రశ్నించారు.కాపు నేస్తం అర్హులైన కాపులందరికి ఇవ్వాలని ముఖ్యమంత్రిని ఎప్పుడైనా అడిగారా అన్నారు. ప్రధానమంత్రి మోడీ అగ్రవర్ణాల పేదలకు 10% రిజర్వేషన్లు కల్పించిన వాటిలో గత ప్రభుత్వం కాపులకు 5% ఇబిసి కోటా కింద రిజర్వేషన్లు అసెంబ్లీలో బిల్లు ఆమోదం చేస్తే జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ బిల్లును రద్దు చేయడాన్ని ఈ పాలేరు కాపులు జగన్మోహన్ రెడ్డిని ఎందుకు ప్రశ్నించ లేదన్నారు. అప్పుడు మీకు కాపు జాతి, కాపు జాతిలోని నిరుద్యోగ యువత గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. కాపు జాతిని ఇలా అన్ని విధాలుగా మోసం చేసిన జగన్మోహన్ రెడ్డికి వైసీపీలోని పాలేరు కాపు ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులకు కాపులే కాకుండా అన్ని సామా జిక వర్గాలను మోసం చేసిన వైసిపికి ఓట్లు అడిగే అర్హత కోల్పోయారన్నారు. పవన్ కళ్యాణ్ వెంట కాపులే కాకుండా ఎస్టి, ఎస్సీ, బీసీ, మైనారిటీ సోదరులు అండగా ఉండారని తెలియజేశారు. 2024లో జరగ బోయే సార్వత్రిక ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్లో జనసేన జెండా ఎగురు తుందని,పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రి అవుతారన్నారు. జనసేన నాయకులు రాచంశెట్టి వెంకటసుబ్బయ్య, బావికాడి గుర్రప్ప, ఆంజనేయులు, చైతన్య, నాగేంద్ర,వెంకటరామయ్య పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా నిర్వహణ జరగడం ఆనందాయకం

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్ : ఆత్మకూరు చరిత్రలో గతంలో ఏ ప్రభుత్వ హయాంలోనూ ఎన్నడూ లేని విధంగా రాష్ట్రస్థాయి ఖో ఖో పోటీలు జరగటం అన్నది నిజంగా ఆహ్వానించదగ్గ విషయమే. ఈ పోటీలకు రాష్ట్రంలోని ఉమ్మడి 13 జిల్లాల నుంచి ప్రతిభ కలిగిన క్రీడాకారులు, వారి వారి ఇన్స్ట్రక్టర్‌లు భారీ సంఖ్యలో ఆత్మకూరు రానున్నారు. ఈ నేపథ్యంలో ఈ పోటీల నిర్వహణ ఆర్థిక భారం పూర్తిగా భరించే శక్తి లేదని ఎమ్మెల్యే వారికి తోచిన ఆర్థిక సహకారం అందిస్తే పోటీల నిర్వహణకు బాగుంటుందని పట్టణ పరిసర ప్రాంత పాఠశాలల నుండి పిడి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డిని కలిసి క్రీడా నిర్వహణ కోసం ఆర్థిక సహాయంకు వినతిపత్రం అందించారు. అందుకు స్పందించిన ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి మొట్ట మొదటి సారిగా తమ నియోజకవర్గంలో, తన ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు జరగటం ముదావహమని, నిర్వా కులకు ఆర్థిక భారం పడకుండా సంబంధించిన ఖర్చు మొత్తం తానే భరిస్తానని, క్రీడాకారులకు, ఆహూతు లకు, అతిథులకు మినరల్ వాటర్‌తో సహా భోజన ఖర్చులు, షామియానాలు, లైటింగ్ ఏర్పాట్లు, అతిథులను ఆహ్వానించటానికి, మొమెంటోలు, సర్టిఫికెట్లతో సహా మొత్తం ఖర్చు ఎంతయినా సరే తామే భరిస్తామని, వైసీపీ ప్రభుత్వ హయాంలో తమ నియోజకవర్గంలో రాష్ట్ర స్థాయి క్రీడా నిర్వహణ జరగటం నిజంగా ఆనంద దాయకం అని,ఖర్చు ఎంతయినా నేను భరిస్తానని భరోసా ఇచ్చారు. ఎంతో కొంత సహాయం చేస్తే చాలు అని వచ్చిన క్రీడాపాధ్యా యులు ఎమ్మెల్యే శిల్పా నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యువ నాయకుడు శిల్పా కార్తీక్ రెడ్డి రానున్నారు.

నాయకుల త్యాగాలను స్మరించుకుంటూ జిల్లా అభివృద్ధికి కృషి చేయాలి

విశాలాంధ్ర - నంద్యాల : ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి అమరజీవి అయిన శ్రీ పొట్టి శ్రీరాములు వంటి నాయకుల త్యాగాలను స్మరించుకుంటూ నూతనంగా ఏర్పాటైన నంద్యాల జిల్లా అభివృద్ధికి ప్రతి ఒక్కరు శాయశక్తులా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సామూన్ పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్లోని వైయస్సార్ సెంటినరీ హాలులో రాష్ట్ర అవతరణ దినోత్సవ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సామూన్, ఎమ్మెల్సీ ఇషాక్ బాషా, జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి, జిల్లా అధికారులు శ్రీపొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో జ్యోతి ప్రజ్వలన అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సామూన్ మాట్లాడుతూ ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర కోసం శ్రీ పొట్టి శ్రీరాములు 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి 1952 డిసెంబర్ 15 వ తేదీన తన ప్రాణాలను అర్పించి అమరులయ్యారన్నారు. భాషా ప్రాతిపదికన ఏర్పడిన తొలి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని, 2014లో ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత ప్రాంతీయ అసమానతలు రూపుమాపి ఆంధ్రప్రదేశ్ కు పూర్వ వైభవం తెచ్చేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి అభివృద్ధి వికేంద్రీకరణతో రాయలసీమ, కోస్తా ఆంధ్ర, ఉత్తర కోస్తా తదితర ప్రాంతాలను అభివృద్ధి చేసే ధ్యేయంతో ముందుకు వెళుతున్నారని, అభివృద్ధి వికేంద్రీకరణ ధ్యేయంతో ప్రజలకు పరిపాలనను చేరువ చేసేందుకు 13 జిల్లాలను 26 జిల్లాలుగా పునర్వ్యవస్థీకరించార న్నారు. అనంతరం శ్రీ చైతన్య విద్యాసంస్థలు, గురురాజా పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. అంతకుముందు పట్టణంలోని సంజీవనగర్ సర్కిల్ లో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి జిల్లా కలెక్టర్ డా.మనజీర్ జిలానీ సామూన్, ఎమ్మెల్సీ ఇస్సాక్ బాష, జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి, ఇతర జిల్లా అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి డిఆర్ఓ మల్లికార్జునుడు, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, ఆర్డిఓ శ్రీనివాసులు, డీఈవో అనురాధ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు టాప్ నంబర్లు తప్పనిసరి

విశాలాంధ్ర - నందికొట్కూరు : నియోజకవర్గంలో ఉన్న అన్ని రకాల ఆటోలకు టాప్ నంబర్లు కచ్చితంగా వేయించుకోవాలని ఈ టాప్ నంబర్స్ వల్ల చాలా ఉపయోగాలు ఉన్నాయని నందికొట్కూరు టౌన్ సిఐ విజయభాస్కర్ ఎస్ఐ వెంకటరమణ లు అన్నారు. మంగళవారం పట్టణంలోని స్థానిక జై కిసాన్ పార్కు నందు పోలీసు వారి ఆధ్వర్యంలో ఆటో కార్మికులకు అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రఘురాం మూర్తి జిల్లా కార్యదర్శి రమేష్ బాబులు హాజరు కావడం జరిగింది. ఈ సందర్భంగా నందికొట్కూరు పట్టణ సీఐ విజయభాస్కర్ మాట్లాడుతూ ఆటో కార్మికులు అన్ని ప్రాంతాల్లో సీరియల్ నంబర్ స్టిక్కరింగ్ను వేయించుకున్నారని నంద్యాల కర్నూలు ప్రాంతాల్లో కూడా వేలాది మంది ఆటో కార్మికులు టాప్ నంబర్లు వేయించుకొని ప్రమాదాలు జరిగిన సందర్భాన్ని తెలియజేస్తున్నారని, ఈ ప్రాంతంలో ఉన్న ప్రతి ఆటో డ్రైవర్ టాప్ నంబర్స్ వేయించుకొని ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని వారన్నారు. పట్టణ ఆటో యూనియన్ నాయకులు నాగేంద్ర, సురేష్,గౌతమ్ నాయుడు, రాజు నాగేశ్వరరావు,శేషన్న పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ సభ్యత్వ నమోదు ప్రారంభం

విశాలాంధ్ర-బనగానపల్లె : పట్టణంలోన కళాశాలలలో ఏఐఎస్ఎఫ్ సభ్యత్వం నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించిన నంద్యాల జిల్లా కార్యదర్శి ధనుంజేయుడు. ఈ సందర్భంగా ధనుంజయ్ మాట్లాడుతూ విద్యార్థులకు సమస్యలు ఉంటే తీసుకురావాలని ఉన్నతాధికారులకు చేరవేసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎర్రిస్వామి, పట్టణ ఆర్గనైజినింగ్ కార్యదర్శి మహేంద్ర, నాయకులు నవీన్, సునీల్, పాల్గొన్నారు.

బేస్‌బాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక

విశాలాంధ్ర - చాగలమర్రి : పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన వెంకట వసంత్ అనే విద్యార్థి జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోటయ్య తెలిపారు. మంగళవారం జరిగిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న వెంకటవసంత్ గత నెలలో ప్రకాశం జిల్లా సింగరాయ కొండలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో అత్యంత ప్రతిభ కనబరచి జాతీయ స్థాయికి ఎంపికయ్యారన్నారు. ఈ నెల నవంబర్ 4న పంజాబ్ రాష్ట్రంలోని లూథియాన్‌లో జరిగే జాతీయ స్థాయి సబ్ జూనియర్ పోటీలలో మన రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థిని, పిడి దాదాపీర్, పిఈటి భారతిలను హెచ్ఎం కోటయ్య,ఉపాధ్యాయులు శాస్త్రి, రవీంద్రారెడ్డి, బురానుద్దీన్, మాబుబాష, సుబ్రమణ్యం, ప్రతాప్, షాకీర్, ప్రసాద్,బాబు,సురేషప్ప అభినందించారు.

హెచ్‌ఎంపై విచారణ

విశాలాంధ్ర-చాగలమర్రి : చాగలమర్రి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి పై వచ్చిన ఆరోపణలపై విచారణ చేస్తున్నట్లు నంద్యాల డిప్యూటీ డీఈఓ మహమ్మద్ బేగ్ తెలిపారు. మంగళవారం పాఠశాలలో ఉపాధ్యాయినులు, తల్లిదండ్రులు, విద్యార్థులతో విడి విడిగా విచారణ చేశారు. కొందరు ఇచ్చిన పిర్యాదుల మేరకు విచారణ జరిపి నివేదికలను డిఈఓకు అందజేస్తామన్నారు. ఓ పిర్యాదుదారిని పక్కన కూర్చో బెట్టుకొని హెచ్‌ఎంను విచారించటం పట్ల ఆమె అసహనం వ్యక్తం చేసారు. తన పై పిర్యాదు చేసిన వ్యక్తి ముందరే తనను విచారించటం చాలా బాధకర మన్నారు. పాఠశాలలో తనపై వచ్చిన ఆరోపణలపై నిక్కచ్చిగా విచారణ జరిపి తగు న్యాయం చేయాలని హెచ్‌ఎం కోరారు. ఎంఈఓ అనురాధ పాల్గొన్నారు.

పట్టణంలో వ్యక్తి ఆత్మహత్య

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్ : ఆత్మకూరు పట్టణానికి చెందిన ఇమ్రాన్ అనే వ్యక్తి కుటుంబ ఆస్తి తగాదాల వల్ల మనస్థాపానికి గురై మరణించడం జరిగిందని ఎస్ఐ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు.మాట్లాడుతూ 30వతేదీ ఇంటి నుంచి బయటికి వెళ్లి రాలేదని 31వ తేదీన మృతుని భార్య నిలోఫర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారన్నారు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారని చెప్పారు.మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వైసీపి ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించండి

విశాలాంధ్ర-పాములపాడు : రాయలసీమ పశ్చిమ నియోజకవర్గం వైసిపి పట్టభద్రుల అభ్యర్థి వెన్నపూసల రవీంద్రారెడ్డి తరపున వైసీపీ నందికొట్కూరు నియోజకవర్గ కోఆర్డినేటర్ దుర్గం బాలాజీ, మండల వైసీపీ నాయకులు (బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి వర్గం) టీ నాగరాజు మరియు వైసీపీ నాయకులతో మంగళవారం పాములపాడులోని జడ్పీ ఉన్నత పాఠశాల కస్తూరిబా బాలికల పాఠశాల,వివిధ పాఠశాలల ఉపాధ్యాయులను కలిసి ప్రచారం నిర్వహించారు ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నారని అలాంటి జగన్మోహన్ రెడ్డి పార్టీ తరఫున మరియు రాష్ట్ర క్రీడల అధ్యక్షులు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి బలపరుస్తున్న రాయలసీమ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్సీ అభ్యర్థి గా నిలబడిన వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పట్టబద్రులను, ఉపాధ్యాయులను వారు కోరారు. మండల వైసీపీ నాయకులుఎం.నాగరాజు, ప్రైవేట్ పాఠశాలల సంఘం నాయకులు ఆర్ఎస్ఆర్ గోపాల్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో ప్రతి ఇంట సంతోషం

విశాలాంధ్ర - చాగలమర్రి : జగనన్న పాలనలో ప్రతి ఇంట్లో ప్రజలు సుఖ సంతోషాలతో ఉన్నారని ఆళ్లగడ్డ శాసనసభ్యులు గంగుల బీజేంద్రరెడ్డి తెలిపారు. మంగళవారం చాగలమర్రి మండలంలోని,చిన్నబోధనం,పెద్ద బోధనం గ్రామాలలో రెండవ రోజు గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన వివరాల పత్రాలను ప్రజలకు అందచేశారు. ఈ సందర్భంగా రైతులు గతంలో వరదల వల్ల నష్టపోయామని కాని చాలా మందికి నష్టపరిహారం అందలేదని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల వల్ల రైతన్నలకు ఎంతో ఉపయోగం జరుగుతున్నదని ఆయన అన్నారు. రైతు భరోసా క్రింద ప్రభుత్వం అందజేస్తున్న ఆర్థిక సహాయం అన్నదాతలను ఆదుకుంటున్నదని ఆయన తెలిపారు ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ దాదాపుగా నెరవేర్చమన్నారు. ముఖ్యమంత్రి జగనన్న పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారని ఆయన తెలిపారు. ప్రజల వద్దకు వెళ్లే ధైర్యం సత్తా ఒక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులకే ఉందన్నారు తెలుగుదేశం నాయకులు ఏమి సాధించారని ప్రజల వద్దకు వెళ్తారని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర వైసిపి మైనారిటీ సెల్ కార్యదర్శి బాబులాల్,మండల కన్వీనర్ కుమార్‌రెడ్డి,ఎంపిపి వీరభద్రుడు,ఆళ్ళగడ్డ ఎంపిపి రాఘవేంద్ర రెడ్డి,జిల్లా ప్రచార కార్యదర్శి గణేష్ రెడ్డి, ఎంపిటీసీలు పత్తినారాయణ,నరసింహులు,లక్ష్మిరెడ్డి,సర్పంచులు నర్సమ్మ, శివమ్మ, ప్రతాప్ రెడ్డి,గోఉప సర్పంచ్ లు నరేష్ సింహారెడ్డి, ధోని రత్నాలమ్మ,, వైసిపి నాయకులు నంద్యాల మస్తాన్‌రెడ్డి,యామ నరసింహారెడ్డి,ఓబులరెడ్డి, ప్రతాప్ రెడ్డి,రామచంద్రా రెడ్డి,బాలకృష్ణారెడ్డి,,వెంకట్రామ్‌రెడ్డి,వెంకటేశ్వరెడ్డి, సంజీవరెడ్డి,తహసీల్దార్‌విజయకుమార్,ఇన్‌చార్జ్ఎంపిడీఓచంద్రశేఖర్, ఎంఈఓ అనురాధ, ఏఈలు షాజహాన్,కొండారెడ్డి,జగ్గయ్య,ఏఓ నేతాజీ,ఐసిడిఎస్ సూపర్ వైజర్ సుశీల పాల్గొన్నారు.

అకాల వర్షంతో తడిసిన ధాన్యం - ఆందోళనలో రైతులు

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : మండలంలోని అబ్దుల్లాపురం గ్రామంలో మంగళ వారం కురిసిన ఓ మోస్తారు వర్షానికి రైతన్నలు కలాలు, పొలాలలో ఆరబోసిన మొక్క జొన్నలు తడిసి ముద్దయ్యాయి. చిరుజల్లులతో చేతికొచ్చిన పంట కళ్ళెదుట వర్షార్పణం అవుతుంటే రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. అబ్దుల్లాపురం, కోరుమాని పల్లి, తోళ్లమడుగు తదితర గ్రామాల పరిధిలో రైతన్నలు వర్షాధారంగా,బోరు బావులు కింద మొక్కజొన్నను విస్తారంగా సాగు చేశారు. 300 ఎకరాలకు పైగా సాగు చేయగా వారం రోజుల కింద నుండి యంత్రాల ద్వారా పంట కోతలు కోస్తున్నారు. ఇప్పటికి 20% మాత్రమే పంట చేతికొచ్చి కలలో ఆరబోశారని,ఇంకా 80% పంట కోతలు పడాల్సి ఉండగా కురుస్తున్న వర్షాలు రైతన్నలను కలవరపరుస్తున్నాయి. తడిస్తే ధాన్యం దెబ్బతిని రంగు మారి అమ్ముకోవడానికి ఇబ్బందిగా ఉంటుందని తెలిపారు. ఉత్పత్తి బాగా ఉండి చేతికి అందిస్తున్న దశలో వర్షాలు ఆవేదనకు గురి చేస్తున్నాయి. కొంతమంది రైతులు మొక్కజొన్న ధాన్యాన్ని కలాలలో ఆరబోశారు. తెల్లవారుజాము నుండి మేఘమృతమైన ఉన్న ఊహించని విధంగా ఉదయం ఒకసారిగా మోస్తరు వర్షం కురవడంతో రైతన్నలు ధాన్యాన్ని ఆరబోసిన కలాల వద్దకు పరుగులు పెట్టారు.అప్పటికే మొక్కజొన్న రాశులు తడిసి ముద్దయ్యాయి. అయినా ధాన్యంపై పట్టాలు కప్పి ఉంచారు.

కార్మికుల పై రాజకీయ వేధింపులు ఆపాలి

విశాలాంధ్ర - నంద్యాల : రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా నంద్యాల జిల్లాలో ఎమ్మెల్యేలు, సర్పంచులు మధ్యాహ్న భోజన పథకం కార్మికులపై రాజకీయ వేధింపులు చేస్తూ పేద కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని,అధికారులపై ఒత్తిడి చేస్తూ కార్మికులను తొలగించడం దారుణమని ఏపీ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం రమేష్ బాబు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయలక్ష్మిలు విమర్శించారు. మంగళవారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో అనేక చోట్ల గత 20సంవత్సరాల నుండి పని చేస్తున్న పేద మధ్యాహ్న భోజన పథకం కార్మికులపై ఎమ్మెల్యేలు రాజకీయపెత్తనంతో తొలగించాలనిచూడడం సిగ్గుచేటని,రాజకీయాలు ఉంటే గ్రామాల్లో నాయకులు చూసుకోవాలి తప్ప పేద కార్మికులపై ప్రతాపం చూపడం ఏంటని విమర్శించారు. ఈ విషయం పై జిల్లా కలెక్టర్ కు స్పందనలో పిర్యాదు చేశామన్నారు. రాజకీయ వేధింపులకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామన్నారు.నాయకులు రఫీ,సహన, నాగలక్ష్మి, రమిజాబీ, నాగన్న పాల్గొన్నారు.

వైద్య సేవలో ఆశాల పాత్ర కీలకం

విశాలాంధ్ర-వెలుగోడు : వైద్య సేవలో ఆశా వర్కర్ల పాత్ర ఎంతో కీలకమైనదని వారు తమ విధులను ఎంతో బాధ్యత గా నిర్వహించాలని వైద్యురాలు ప్రసన్న లక్ష్మీ అన్నారు.మండలం లోని మోత్కూరు గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా వర్కర్ల సమావేశం నిర్వహించి, గర్భిణీ కేసులు, ఇతర వ్యాధుల గురించి చర్చించారు. ఆరోగ్య సూపర్ వైజర్లు శ్రీదేవి, మధు సూధన రెడ్డి, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఘనంగా ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - నందికొట్కూరు : ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా నందికొట్కూరు పట్టణంలోని అమరజీవి పొట్టి శ్రీరాములు గ్రహానికి ఎమ్మెల్యే ఆర్థర్ మంగళవారం పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం నిరాహార దీక్ష తో ప్రాణ త్యాగం చేసిన మహా వ్యక్తి అని ఆయనను మరవరాదని కొనియాడారు. అనంతరం పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు సత్యనారాయణ, బచ్చు శ్రీనివాసులు సంఘ సభ్యులు ఎమ్మెల్యే ఆర్థర్ ను శాలువతో ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ సుకుర్మియా, మున్సిపల్ వైస్ చైర్మన్ మొల్ల రబ్బాని, కౌన్సిలర్లు జాకీర్ హుస్సేన్, ధర్మారెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు హుస్సేనయ్య, వైసిపి నాయకులు తమ్మడపల్లి విక్టర్, కొంగర నవీన్, దామ గట్ల మాధవరం యేసు రత్నం, సంజన, వేల్పుల నాగన్న, శంకరయ్య, మహేష్ పాల్గొన్నారు.

విశాలాంధ్ర - రుద్రవరం : మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో మంగళవారం ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను తహసిల్దారు వెంకట శివ , రెవెన్యూ సిబ్బంది ఘనంగా నిర్వహించారు. కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉప తహసిల్దారు వెంకటయ్య,ఆర్ఐలు,పలువురువీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

వీఆర్వోలపై పని ఒత్తిడి తగ్గించాలి

విశాలాంధ్ర - డోన్ రూరల్ : మండలంలో పనిచేస్తున్న వీఆర్వోలపై పని ఒత్తిడి తగ్గించాలని ఆయా గ్రామాలలో పనిచేస్తున్న విఆర్వోలు డిప్యూటీ తాహసిల్దార్ మధుకు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. వీఆర్వోలు భాస్కర్‌నాయుడు, సునీల్, మహానంది, మోహన్‌రావు, మహేష్ ,రమేష్ తదితరులు మాట్లాడుతూ మండలంలోని గ్రామాలు చాలా దూరంగా ఉండడంతో అక్కడ ఉన్న సచివాలయాలకు వెళ్లి ముద్రలు వేయడం మరల స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో సమావేశాలకు హాజరు కావాలంటే విఆర్‌ఓలు చాలా వ్యాయ ప్రయాసలు ఎదుర్కోవాల్సి వస్తుందని వారు తెలిపారు.అటు సచివాలయాలలో సమయాన్ని కేటాయించలేక ఇక్కడ సమావేశాలకు సకాలంలో హాజరు కావాలన్నా ఒత్తిడితో వీఆర్వోలు సతమతమవుతున్నారని తెలిపారు. ఆయా సచివాలయాలకు సంబంధించి రైతులకు సంబంధించిన భూ సమస్యలు పరిష్కరించడానికి తగిన సమయం కేటాయించలేక పోతున్నామని వారు తెలిపారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు తమ సమస్యలను గుర్తించి సరైన నిర్ణయాన్ని తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు.

జిల్లా స్థాయి క్రీడలకు విద్యార్థుల ఎంపిక

విశాలాంధ్ర-ఉయ్యాలవాద : మండలంలోని కొండుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తాలూకా స్థాయిలో పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు నరసింహుడు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గత నెల 31వ తేదీన ఆళ్లగడ్డ తాలూకా పరిధిలోని పాలసాగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పలు క్రీడా పోటీల్లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొని ఏడుగురు విద్యార్థులు ప్రతిభ కనబచారన్నారు. గురు లక్ష్మీ అనే విద్యార్థిని కబడ్డీ, లాంగ్ జంప్ రెండు పోటీల్లో విజయం సాధించి జిల్లా స్థాయికి ఎంపిక అయిందన్నారు. పాఠశాలలో పిడి పోస్ట్ ఖాళీగా ఉన్నప్పటికీ ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో విజయం సాధించడంతో విద్యార్థులను అభినందించారు.

సంక్షేమ పథకాలలో ఏపీ టాప్

విశాలాంధ్ర - బేతంచెర్ల రూరల్ : సంక్షేమ పథకాలలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఏపీని అగ్రగామిగా నిలబెట్టారని మండల ఎంపీపీ బుగ్గన నాగ భూషణం రెడ్డి, సీనియర్ నాయకుడు బాబుల్‌రెడ్డి అన్నారు. మంగళ వారం సిమెంట్ నగర్ లో గడప గడప కు మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి అమ్మఒడి, రైతు భరోసా, జగనన్న విద్యా దీవెన, జగనన్న గోరు ముద్ద,వైఎస్సార్ చేయూత,వైఎస్సార్ ఆరోగ్యశ్రీ వంటి ఎన్నో వినూత్న పథకాలతో ప్రజలు లబ్ధి పొందుతున్నారని, వీటితో పాటు రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన చొరవతో నియోజకవర్గ పరిధి లోని330కోట్లతో గోరుకల్లు రిజర్వాయర్ నుండి ప్రతి ఇంటికి స్వచ్ఛమైన మంచి నీటి సౌకర్యం, ప్రతి గ్రామానికి రోడ్లతో అనుసంధానం, మరిన్ని అభివృద్ధి పనులతో మండలాన్ని సస్యశ్యామలం చేస్తున్నారని తెలిపారు. బేతంచెర్ల నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, గోరుమాను కొండ సర్పంచ్ కోడెవెంకటేశ్వర్లు, మైనారిటీ నాయకులు మూర్తుజావలి, వైస్ ఖాజా,కన్వీనర్ లక్ష్మీ రెడ్డి,గ్రామ నాయకులు యాకోబు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

విశాలాంధ్ర - కొత్తపల్లి : మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు ఉంటాయని సచివాలయ సిబ్బంది సమయ వేళలు పాటించాలని ఎంపీడీవో మేరీ తెలిపారు. మంగళవారం మండలంలోని నందికుంట గువ్వలకుంట్ల గ్రామాల్లో ఉన్న సచివాలయంలను తనిఖీ చేశారు. వారు మాట్లాడుతూ ప్రతి సచివాల యంలో పనిచేస్తున్న సిబ్బంది సమయ వేళలు పాటించకుండా విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రతిరోజు మూడు సార్లు బయోమెట్రిక్ వెయ్యాలన్నారు. విధులకు వచ్చి బయట తిరుగుతున్న వారిపై ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు.గ్రామాల్లో ఉన్నఅంగన్వాడీ కేంద్రాలను పెన్షన్ పంపిణీ తనిఖీ చేశారు.

గాంధీజీ కలలు స్వరాజ్యం జగనన్నతోనే సాధ్యం

విశాలాంధ్ర - నంద్యాల రూరల్ : మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డితోనే సాధ్యమైందిని నంద్యాల ఎమ్మెల్యే శిల్ప రవిచంద్ర కిషోర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నంద్యాల పరిధిలోని పుల్లారు గ్రామంలో వాడ వాడల ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమం 52వ రోజుకు చేరుకుంది. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం కంటే వైఎస్ఆర్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి అందుతుందన్నారు. సచివాలయం ఏర్పాటు ద్వారా ప్రతి సమస్య గ్రామ సచివాలయంలోని పరిష్కారం అవుతుందని ఆయన వెల్లడించారు. చిన్నపాటి సమస్యలు ఉంటే అధికారులు ఎప్పటికప్పుడు రొయ్యలకు అందుబాటులో ఉంటారని ఆయన అన్నారు. అధికారులు, వైఎస్ఆర్ పార్టీ నాయకులు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని వాడ వాడలా ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో నంద్యాల మండల అధ్యక్షుడు శెట్టి. ప్రభాకర్, మహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చల్లా భగీరథరెడ్డి ఆరోగ్యం పై వదంతులు అవాస్తవం

విశాలాంధ్ర - అవుకు : ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యుడు చల్లా భగీరథ్ రెడ్డి ఆరోగ్యం పై వదంతులు నమ్మవద్దని చల్లా పార్టీ కార్యాలయం మంగళవారం ఒక ప్రకటన చేశారు. ఎమ్మెల్సీ చల్లా భగీరథ్‌రెడ్డి అనారోగ్యం కారణంగా హైదరాబాద్ పట్టణంలోని ఏఐజి ఆసుపత్రిలో చికిత్స పొందు తున్న మాట వాస్తవమేనని అయితే ఆయనకు డాక్టర్లు ఐసీయూలో ఉంచి చికిత్సలు చేస్తున్నారని ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉందని చల్లా పార్టీ కార్యాలయం తెలిపారు. ఆయన ఆరోగ్యం క్షీణించి మృతి చెందారని సోషల్ మీడియాలో వాట్సాప్‌లో కొందరు తప్పుడు ప్రకటనలు చేశారని ఇదంతా అవాస్తవమని ఆయన అభిమానులు,కార్యకర్తలు,బంధువులు ఎవరు కూడా అధైర్య పడవద్దు అని చల్లా పార్టీ కార్యాలయం తెలిపింది. ఎమ్మెల్సీ చల్లా భగీరథ్ రెడ్డి త్వరగా కోలుకొని ఆయన మనందరితో కలిసి మన మధ్యలోకి వస్తాడని తెలిపారు.

జిల్లాస్థాయి క్రీడలకు ఎంపికైన కేజీబీవీ బాలికలు

విశాలాంధ్ర - శిరివెళ్ల : మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యానిలయంలో గల విద్యార్థినిలు నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో సత్తా చాటుకున్నట్టు స్పెషల్ ఆఫీసర్ జ్యోతి పేర్కొన్నారు. యోగ,కబడ్డీ కోకో, రన్నింగ్, డిస్క్ త్రో, తదితర క్రీడా పోటీల్లో ప్రథమ ద్వితీయ, తృతీయ స్థానాల్లో జైతయాత్ర మోగించినట్లు తెలిపారు. నియోజకవర్గస్థాయి క్రీడ పోటీల్లో హెరారా హెరాహీగా సాగిన మ్యాచుల్లో తిరుగులేని విజయాన్ని సొంతం చేసుకోవడంతో కేజీబీవి ఎస్ఓ జ్యోతీ,మరియు ఉపాపాధ్యాయినిలు విజేతలను ఘనంగా సన్మానించి అభినందించారు.యోగ ఆసనాలలో సుహాన, సోనియా మీర్జా సమీన,మూడువేల మీటర్ల పరుగు పందెంలో, నిత్యా లక్ష్మి,1500 మీటర్ల పరుగు పందెంలో స్ఫూర్తి,డిస్క్ త్రో అండర్ 17 లో లక్ష్మి దేవి ప్రథమ స్థానంలో జయకేతనం ఎగురవేశారు.కబడ్డీలో అండర్ 17లో శాకుంతి, అండర్ 14లో సమ్రీన్,కోకో అండర్ 17లో ఫౌజియ, 600 అండర్ 14లో మీటర్ లో హమిద, సోనియా మీర్జా,తదితర కేజీబీవీ బాలికలు అండర్ 14, అండర్ 17 లో ఉత్తమ పోరాట ప్రతిభ చాటుకోవడం తో జిల్లా క్రీడలకు ఎంపికైనట్లు ఎస్ ఓ జ్యోతి పేర్కొన్నారు.

అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య

విశాలాంధ్ర - శిరివెళ్ల : వ్యవసాయంలో భూసార మందులు, క్రిమిసంహారక మందుల ధరలు రెట్టింపు కావడం, పెట్టుబడి వ్యయం అధికం కావడంతో వ్యవసాయం కోసం చేసిన అప్పులు కోనేటి ఆదాము 36 అను యువ రైతుకు ఉరితాడుగా మారాయి.ఒక ఎకరా పొలం తో పాటు సుమారు 8 ఎకరాలకు పైగా పొలాన్ని కౌలుకు తీసుకొని సాగు చేసుకుంటూ బతుకుబండి లాగిస్తున్న ఓ యువరైతుకు వ్యవసాయ పెట్టుబడులు దిక్కుతోచని స్థితిగా మార్చాయి. వ్యవసాయం కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం కరువై పెట్టిన పెట్టుబడికి రాబోయే దిగుబడిని గ్రహించి ఈ ఏడాదైనా అప్పులు తీరేలా లేవని తల్లడిల్లుతూ మానసికంగా తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శిరివెళ్ల మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో నివసిస్తున్న కోనేటి ఆదాము 36 అను యువరైతు ఆత్మహత్యకు పాల్పడి కర్నూలులో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు.వేలకు వేలు వెచ్చించి వ్యవసాయ పంటల సంరక్షణ కోసం కొనుగోలు చేసిన మందులు కనీసం రెక్కల పురుగును చంపలేని స్థితిలో క్రిమిసంహారక మందులు మార్కెట్లో విచ్చలవిడిగా రైతులకు అంటగడుతున్నట్లు పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తల్లి తండ్రి భార్య ఇద్దరు సంతానాన్ని వదిలి తుది శ్వాస వదిలిన కోనేటి ఆదాం కుటుంబ సభ్యులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకొని న్యాయం చేయాలని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, బుధవారం 02, నవంబర్ 2022

ఇసుక తవ్వకాలకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వాలి

విశాలాంధ్ర - పెద్దకడబూరు : ప్రభుత్వం ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇవ్వాలంటూ సిపిఐ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి భాస్కర్ యాదవ్, మండల కార్యదర్శి వీరేష్, కమిటీ సభ్యులు రాజు మాట్లాడుతూ ప్రభుత్వం కాంట్రాక్టర్లకు మద్దతు ఇస్తూ ఇసుక మాఫియా చేయిస్తుందని ఆరోపించారు. పేద ప్రజలు గృహ నిర్మాణాలకు ఇసుక రవాణా చేస్తే పోలీసుల చేత, రెవెన్యూ సిబ్బందితో దాడులు చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పేద ప్రజల గృహ లబ్ధిదారులకు ఇళ్లు నిర్మించుకోవడానికి ఇసుక అవసరం అవు తుందని తెలిపారు. లబ్ధిదారులు అధికారుల అనుమతి తో ట్రాక్టర్ల ద్వారా ఇసుక రవాణా చేస్తే కొద్ది మంది మద్యపానానికి డబ్బులు ఇస్తే సరి లేకపోతే పోలీసులకు ఫోన్ చేసి పట్టిస్తామని బెదరిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ కార్యాల యాలను నిర్మిస్తున్న కాంట్రాక్టర్లకు ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇస్తారు కానీ గృహ లబ్ధిదారులకు అనుమతులు ఇవ్వరా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గృహ లబ్ధిదారులకు ఇసుకను తవ్వకోవడానికి అనుమతులు ఇవ్వాలని లేనిపక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీవో రమణప్పకు అందజేశారు. నాయకులు సర్ధాజ్ పటేల్, తిక్కన్న, హనుమన్న, లక్ష్మన్న, వడ్డే రాముడు, ఏఐకెఎస్ తాలూకా గౌరవ అధ్యక్షులు హనుమంతు, జాఫర్ పటేల్,సయ్యద్ పటేల్ పాల్గొన్నారు.

వికలాంగుల ఆశ్రమం ధ్వంసం

విశాలాంధ్ర - ఆదోని టౌన్ : పట్టణ సరిహద్దు లోని 41 అడుగుల ఆంజనేయ స్వామి దేవా లయం దగ్గర ఉన్న వికలాంగుల ఆశ్రమం భూ కేటుగాళ్ల చేత ధ్వంసానికి గురయింది. మంగళవారం ఘటనా స్థలంలో ఆశ్రమ నిర్వాహకులు విశాలాంధ్ర విలేకరితో మాట్లాడారు. ఆశ్రమం ధ్వంసంపై నిర్వాహకులు, వికలాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఈరన్న,డివిజన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు ఆగ్రహ వ్యక్తం చేశారు. ముత్యాల రామకృష్ణ అనే వ్యక్తి నకిలీ డాక్యుమెంట్స్ తీసుకువచ్చి స్థలం నాదంటూ వాదిస్తున్నాడని ఆరోపించారు. స్థలం యొక్క పూర్వపత్రాలు దేవాలయానికి చెందిన ఇనామ్ భూమిగా ఉందన్నారు. ఇనామ్ భూమిని క్రయ విక్రయాలు జరపకూడదన్న సంగతి మరచి నఖిలి పత్రాల ఆధారంతో వికలాంగులకు ఆసరాగా ఉన్న ఆశ్రమ షెడ్డును కూల్చడం దారుణం అన్నారు. దాదాపు 15 లక్షలు వెచ్చించి షెడ్డు నిర్మించు కుంటే దౌర్జన్యంతో కూల్చివేయడం ఏంటని ప్రశ్నించారు. నేరుగా స్థల దాతలు దగ్గర ఆశ్రమ నిర్మణానికి అగ్రిమెంట్స్ రాసుకున్నామని వారు తెలిపారు. ముత్యాల రామకృష్ణ పై స్థానిక పోలీస్ స్టేషన్లో కేసు కూడా పెట్టడం జరిగిందని తెలియజేశారు. ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకుని వికలాంగులకు న్యాయం చేయాలని కోరారు.

టమోటాకు గిట్టుబాటు ధర ఇచ్చి రైతులను ఆదుకోవాలి

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : జిల్లాలో టమోటా పంటకి గిట్టుబాటు ధరను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని లేనిపక్షం లో రాష్ట్ర ప్రభుత్వమే రైతుల దగ్గర నుండి కేజీ 20రూపాయల చొప్పున కొనుగోలు చేయాలని సిపిఐ, ఏపీ రైతు సంఘాల ఆధ్వర్యంలో కర్నూలు కలెక్టరేట్ కార్యా లయం ఎదుట టమోటాను పోసి రైతులు ధర్నా నిర్వహించారు. ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జగన్నాథం, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మునెప్ప, నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డిలు మాట్లాడుతూకర్నూల్ రైతు బజార్లో కిలో టమోటా నాలుగు రూపాయలకు అమ్ముతున్నారని,వ్యాపారులకు రైతులు కిలో రూపాయన్నరకి (1.50)అమ్మి కూలీలు,రవాణా ఖర్చులు కూడా రాకపోవడంతో రైతులు ఏడ్చుకుంటూ ఇండ్లకు వెళ్లడం జరిగిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో దాదాపు 50 వేల ఎకరాలలో రైతులు టమోటా సాగు చేయడం జరిగిందని, అయితే రైతులకు గిట్టుబాటు ధర లేక కేవలం కిలో రూపాయలు ధర ఉండడంతో కనీసం కూలీల ఖర్చులు కూడా గిట్టుబాటు కాక రైతులు టమోటా పంటను పొలంలోనే గొర్లకు వదిలేసే పరిస్థితి దాపరించిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కొక్క రైతు ఎకరాకి 50 వేల రూపాయల వరకు పెట్టుబడి పెట్టడం జరిగిందని, ఇప్పుడు గిట్టుబాటు ధర లేక చేసిన అప్పులు తీరక రైతుల తీవ్ర ఆందోళనలో ఉన్నారని వారి ఆదుకోవలసిన రాష్ట్ర ప్రభుత్వం మాటలకు పరిమితమైంది తప్ప రైతుల బాధలు పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చెప్పినట్టుగా వైసీపీ ప్రభుత్వం నిజంగా రైతు ప్రభుత్వం అయితే టమోటా రైతుకు 50 వేల రూపాయల నష్టపరిహారం చెల్లించాలి లేదంటే పండిన పంటను కేజీ 20 రూపాయల చొప్పున రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. సిపిఐ నగర సహాయ కార్యదర్శి మహేష్, శ్రీనివాసరావు, ఏఐటీయూసీ నగర కార్యదర్శి జి చంద్రశేఖర్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కే శ్రీనివాసులు, నగర అధ్యక్ష కార్యదర్శులు బాబయ్య,బీసన్న సిపిఐ నగర నాయకులు ఈశ్వర్,నాల్లన్న, అన్వర్,రామాంజనేయులు, చంటి పాల్గొన్నారు.

భువనేశ్వరి ట్రేడర్స్ లైసెన్సును రద్దు చేయాలి

విశాలాంధ్ర - ఆదోని రూరల్ : అకిరా నకిలీ పత్తి విత్తనాలు అమ్మకాలు జరిపిన భువనేశ్వరి ట్రేడర్స్‌పై విచారణ చేపట్టి లైసెన్స్ తక్షణమే రద్దు చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు నియోజకవర్గ ఇన్చార్జి నీలకంటప్ప, దిలీప్ దోకా,దేవిశెట్టి వీరేష్,మారుతి రావు,సాయినాథ్,మద్దిలేటి, నిసర్ అహ్మద్ మంగళవారంమండల వ్యవసాయ అధికారి పాపిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ అకిరా పత్తి విత్తనాలను కృత్రిమ కోరత సృష్టించి రైతులను నిట్టినిలవన మోసం చేసిన సంగతి, రైతులు రోడ్డెక్కిన సంగతి అధికార పార్టీకి తెలియదా అంటూ నిద్ర మత్తును విడాలని ఉద్యమ చేశారు.మండలంలోని విరుపాపురం, చిన్న హరివారం, పెద్ద హరివాణం, పెద్ద తుంబలం,పెద్దకడబూరు 17 మండలాల నుంచి అకిరా, శ్రీ భాగ్య నాసిరకమైన పత్తి విత్తనాలు రైతు నెత్తిన గుదిబండల అప్పులను మిగిల్చిం దని ఆవేదన వ్యక్తం చేశారు.ఎమ్మార్పీ ధరలు అధిగమించి రూ,,1800 దాకా విక్రయాలు జరిపా రని తెలియజేశారు. భవిష్యత్తులో ఇటువంటి దురాగతాలు జరగకూడదంటే సంబంధిత దుకాణ యజమానులపై కంపెనీలపై క్రిమినల్ కేసులు బనాయించి, రైతులకు పరిహారాన్ని నేరుగా వారి ద్వారానే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వమే కనకదాసు జయంతిని నిర్వహించాలి

విశాలాంధ్ర-హొళగుంద : రాష్ట్ర ప్రభుత్వమే కనకదాసుని జయంతిని నిర్వహించాలని మండల కురవ సంఘం గౌరవ అధ్యక్షులు కాలింగ ప్రసాద్ కురవ సంఘం నాయకులు శేషప్ప సుధాకర్ గిరి మంగళవారం డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ ఈనెల 11న జరిగే కనకదాసుని జయంతి వేడుకలను అన్ని గ్రామాల్లో నిర్వహించాలని అలాగే మాదాసి మా దారి కురువలకు ఎస్సీ కుల సర్టిఫికెట్ ఇవ్వాలంటూ ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులకు అధికారులకు వినతిపత్రం సమర్పించాలని కోరారు కనకదాసుని జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించుకోవాలని కురువ సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు.

గ్రామాభివృద్ధే వైసిపి ధ్యేయం

విశాలాంధ్ర - కోసిగి : గ్రామాభివృద్ధే వైసిపి ధ్యేయమని ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాలతో పాటు ప్రతి చిన్న కాలనీలో సిసి రోడ్ల నిర్మాణ పనులకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు నిధులు మంజూరు చేసిందని వైసీపీ మండల ఇన్చార్జి మురళీమోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక దొరల చావిడి నుంచి ఊరు వాకిలి వరకు అదేవిధంగా పోలీస్ స్టేషన్ వరకు ఎంపీపీ. ఈరన్న అధ్యక్షతన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. వారు మాట్లాడుతూ మంత్రాలయం వైసిపి ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గంలో ఎక్కడ రోడ్డు సమస్య ఉన్న,తమ దృష్టికి తీసుకురావాలని వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కొత్త రోడ్ల నిర్మాణ పనులకు చేపడతారన్నారు. ప్రస్తుతం 440 మీటర్లకు గాను 30 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. వైసిపి నాయకులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్కిన్ డిసీస్‌తో కాడి ఎద్దు మృతి

విశాలాంధ్ర - వెల్దుర్తి రూరల్ : మండల పరిధిలోని రత్న పల్లె గ్రామంలో లంపి స్కిన్ డిసీస్‌తో కాడిఎద్దు మృతి చెందింది. పశు వైద్యాధికారిని శాంత లత మాట్లాడుతూ నాలుగు ఎద్దులకు లంపి స్కిన్ డిసీస్‌గా అనుమానం ఉందని రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

ప్రశంసాపత్రం మరింత బాధ్యత పెంచింది

విశాలాంధ్ర - ఆదోని : జిల్లా ఎస్పీ సిధార్థ కౌశిల్ చేతుల మీదుగా వీక్లి బెస్ట్ పర్ఫార్మెన్స్ ప్రశంసా పత్రాన్ని అందుకోవడం ఉద్యోగం పట్ల మరింత బాధ్యత పెంచిందని కానిస్టేబుల్ ఖాసిం అన్నారు. ఆదోని రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ చోరీ కేసులో అపహరణకు గురైన రూ.27లక్షల92వేల నగదును రికవరీ చేయడంలో అంకితభావంతో మంచి పనితీరు కనబరిచిన కానిస్టేబుల్ ఖాసీంను మంగళవారం స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో ప్రశంసాపత్రాన్ని అందజేశారు. కానిస్టేబుల్ మాట్లాడుతూ పోలీసు సిబ్బందిలో ఉన్న ప్రతిభను గుర్తించి అవార్డులు అందించడం సంతోషంతో పాటు గర్వంగా వుందని అన్నారు.

థాంక్ యూ, ఫ్యామిలీ ఫిజిషియన్

విశాలాంధ్ర-మద్దికేర రూరల్ : ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంలో భాగంగా మంగళ వారం బురుజుల గ్రామ సవాచివాలయంలో వైద్య ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఆరోగ్య శ్రీ లబ్ధిదారు డైన బాలుడు దిలీప్ కుమార్ తనకు ప్రభుత్వం అందించే సేవలు మరియు ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం సిబ్బందికి థాంక్స్ యూ అంటూ ఆనందం వ్యక్తం చేశారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం మారుమూల గ్రామాల ప్రజలకు సంజీవని లాంటిదని ప్రజల వద్దకే ఆరోగ్య సేవలు అందుబాటులో ఉన్నాయి అని ఆసుపత్రికి రాలేని మంచానికే పరిమితం అయిన వ్యాధిగ్రస్తులకు వారి ఇంటి వద్దకే ఆరోగ్య సేవలు అందిస్తున్నట్లు వైద్యాధికారి నాగేష్, మనోజ్ కుమార్ తెలిపారు. హెల్త్ అసిస్టెంట్ ప్రకాష్ రావు, సరస్వతి, ఆశ కార్యకర్తలు అంగన్వాడీ కార్యకర్తలు సచివాలయం సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

మంచినీటి ట్యాంకర్ ద్వారా మిరప పంటకు నీరు

విశాలంధ్ర-హొళగుంద : మండలంలోని గజ్జహళ్లిలో మంగళవారం రైతు బుడెన్ సాబ్ మంచినీటి ట్యాంకర్ ద్వారా మిరప పంటకు నీరును అందించారు. ఎల్ఎల్‌సి దిగివ కాలువకు అధికారులు నీటిని నిలిపి వేయడం వల్ల పంటలు ఎండిపోతున్నాయని ఆరోపించారు. ఉన్న ఎకరం 50 సెంట్ల పొలంలో మిరప పంట వేశామని నీరులేక ఎండిపోతుందని అందువల్ల రోజుకు 8 వేల రూపాయలు ఖర్చు చేసి మంచినీటి ట్యాంకు ద్వారా నీటిని తడుస్తున్నామని రైతు బుడెన్న పేర్కొన్నారు. ఎల్ ఎల్ సి అధికారులు ఎల్ ఎల్ సి దిగువ కాలువకు నీటిని నిలిపివేయడం వల్ల రైతులకు కష్టాలు ఎదురయ్యాయి, కాలువలో నీటి సరఫరా ఆగిపోవడం వల్ల కోట్లాది రూపాయలు నష్టం జరిగిందని రైతులు వాపోయారు. నీరు లేక పంటలు ఎండిపోయి అప్పుల పాలవుతామని అందుకోసం జిల్లా ప్రజా ప్రతినిధులు జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని వెంటనే దిగువ కాలువకు నీటిని విడుదల చేయాలని రైతులు విజ్ఞప్తి చేశారు.

గుంతల మయమైన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి

విశాలాంధ్ర - పత్తికొండ : గుంతల మయమైన రోడ్లకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఐ ఆధ్వర్యంలో స్థానిక చదువుల రామయ్య భవనం నుండి పట్టణ పురవీధుల గుండా ర్యాలీ చేపట్టి నాలుగు స్తంభాల మండపం దగ్గర ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పత్తికొండ పట్టణంతోపాటు, పత్తికొండ నుండి దూదే కొండ వరకు రోడ్లు పూర్తిగా దెబ్బతిని గుంతల మయం కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చి మూడున్నర సంవత్సరాలు కావస్తున్న ఎక్కడ కూడా అభివృద్ధి చేసింది లేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే రోడ్ల దుస్థితి చూసి కూడా ఏమాత్రం స్పందించకపోవడం విడూరంగా ఉందన్నారు. పట్టణంలో జన నివాసాలు లేని చోట సీసీ రోడ్లు వేసి, పేదలు నివాసం ఉంటున్న కాలనీలలో సిసి రోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మించడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. పత్తికొండ నియోజకవర్గంలో ఇన్చార్జి అధికారుల పాలన కొనసాగించడాన్ని ఆయన తప్పు పట్టారు. వైసీపీ నేతలు ఇసుక మాఫియా, భూమాఫియా, ఎర్ర మట్టి మాఫియాలుగా ఏర్పడి ప్రజాధనాన్ని కొల్లగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్టోబర్ నెలలో 20రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు రైతులు వేసిన వివిధ రకాల పంటలు పూర్తిగా నష్టపోవడం జరిగిందని, ప్రజా ప్రతినిధులు దెబ్బతిన్న పంట లను పరిశీలించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. పత్తికొండ నియోజకవర్గంలో రైతులు అధిక మొత్తంలో టమోటా పంటను సాగు చేస్తారని, టమోటాకు గిట్టుబాటు ధర లభించక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ప్రభుత్వం తక్షణమే స్పందించి టమోటాకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో వెనుకబడ్డ పత్తికొండ నియోజకవర్గంలో టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని, గుంతల మయమైన రోడ్లకు ఏమాత్రం కాలయాపన చేయకుండా మరమ్మతులు చేపటాలని డిమాండ్ చేశారు.ఆర్డీవో మోహన్దాస్‌కు వినతిపత్రం సమర్పించారు. సిపిఐ పట్టణ కార్యదర్శి ఎస్.రామాంజనేయులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి డి.రాజా సాహెబ్, తుగ్గలి మండల కార్యదర్శి సుల్తాన్, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు గురుదాస్, ప్రజా సంఘాల నాయకులు కారన్న, పెద్ద ఈరన్న, కృష్ణయ్య, రంగన్న, నెట్టికంటయ్య, ఎం.కే. సుంకన్న, అల్తాఫ్, నజీర్, కొత్తపల్లి, వందికోన సిపిఐ శాఖ కార్యదర్శులు గిడ్డయ్య గౌడ్, జొహరాపురం కాశి, పాల్గొన్నారు.

చిరుత పులి మృతి

విశాలాంధ్ర - కోసిగి : కర్నూలు జిల్లా కోసిగి మండల పరిధిలోని దుద్ది గ్రామ సమీపంలో ఉన్న ఓరుగట్టు ఆంజనేయస్వామి కొండ వెనుక భాగంలో తాయమ్మ దేవి గుడి ఎదురుగా ఉన్న వాగులో చిరుత పులి మృతి చెందింది.మంగళవారం ఉదయం రైతులు తమ పొలాలకు వెళ్తుండగా మృతి చెందిన చిరుత పులిని చూసి భయాందోళన గురయ్యారు. చాలాసేపు అయినప్పటికీ ఉలుకు పలుకు లేకపోవడంతో దగ్గరకు వెళ్లి చూడగా చిరుతపులి మృతి చెందిన విషయం తెలుసుకున్నారు. ఆ విషయాన్ని ఫారెస్ట్ అధికారులకు తెలియజేయడంతో హుటాహుటిన ఘటన స్థలానికి ఫారెస్ట్ అధికారులు చేరుకొన్నారు. చిరుత పులి అనారోగ్యంతో మృతి చెందిందా లేక ఇంకేమైనా జరిగిందనే కోణంలో విచారణ చేపట్టి పరిశీలించారు. గ్రామ సర్పంచ్ వరలక్ష్మి ఆదివార ంలో ఫారెస్ట్ అధికారులు చిరుత పులి కళేబరానికి పంచనామ నిర్వహించి దహన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా (డీఎఫ్ఓ)జిల్లా అటవీశాఖాధికారి శివశంకర్ రెడ్డి మాట్లాడుతూ చిరుతపులులు మనుషులకు, హానిచేయవని వాటి జోలికి ఎవరు వెళ్లొద్దని తెలియజేశారు. ప్రస్తుతం దుద్ది గ్రామ సమీపంలో చిరుత పులి మృతి చెందడంతో మండలంలో ఇంకెన్ని చిరుతపులు ఉన్నాయో అని ఆయా గ్రామ ప్రజలు భయాందోళన గురవుతున్నారు. రాత్రి సమయాల్లో పొలాలకు వెళ్లాలన్న ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు.

మండల ఏపీయూడబ్ల్యూజే నూతన కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర - నందవరం : మండలం ఏపీయూడబ్ల్యూజే నూతన మండల కమిటీ ఎన్నికను మంగళవారం సోమన్న అధ్యక్షత నంద వరంలో ఎన్నుకున్నారు.ముఖ్య అతిధులుగా ఏపీయూడబ్ల్యూజే యూనియన్ నాయకులు, శ్రీనివాస్ నాయుడు, పరమేష్, బీమన్న శివ, హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ఏపీయూ డబ్ల్యూజే యూనియన్‌లోఉన్న విలేకరులుక్రమశిక్షణకు మారుపేరని తెలిపారు. విలేకరులు అందరూ ఐకమత్యంతో ఉండాలని, కలిసి కట్టుగా ఉండి మన సమస్యలు మనమే పరిష్కరించుకోవాలన్నారు. అర్హులైన విలేకరుల పిల్లలకు 60% ప్రైవేట్ పాఠశాలలో, వారి కుటుంబానికి 50శాతం ప్రైవేట్ ఆసుపత్రిలో రాయితీ కల్పించాలని డిమాండ్ చేశారు. మండల అధ్యక్షుడుగా ఉపేంద్ర రెడ్డి, ఉపాధ్యక్షుడు గా దేవదాసు,ప్రధాన కార్యదర్శిగా కుమార్, సహాయ కార్యదర్శి విశ్వనాథ్, కోశాధికారి భీమశేఖర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి శివరాం, గౌరవ అధ్యక్షులు కాశిం, రాజశేఖర్, కార్యవర్గ సభ్యులు సోమన్న, నరసింహ రెడ్డి,ఖలిల్,ఉరుకుందులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

డ్రైనేజీ పూడికతీత పనులు చేపట్టాలి

విశాలాంధ్ర - ఆస్పరి : మండల పరిధిలోని ములుగుందం మేజర్ గ్రామ పంచాయతీలో డ్రైనేజీ పూడికతీత పనులు చేపట్టకపోవడంతో ఎక్కడ మురుగు అక్కడే ఉండి దోమలు విలయతాండవం చేస్తున్నాయని తక్షణమే డ్రైనేజీ పూడికతీత పనులు చేపట్టాలని ఏఐవైఎస్ మండల కార్యదర్శి రమేష్, సహాయ కార్యదర్శి దస్తగిరిలు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సచివాలయ కేంద్రం వద్ద ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో గ్రామంలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ మేజర్ గ్రామపంచాయతీలో ప్రధాన డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారయ్యి మురుగునీరు పారుదలలేక ఎక్కడ మురుగు అక్కడే నిలబడి దోమలకు నిలయంగా మారిందని, అంటువ్యాధులు వ్యాప్తి చెందే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని సంవత్సరాలుగా ప్రధాన డ్రైనేజీలు పూడికతీత పనులు చేపట్టక పోవడంతో చెత్తా చెదారంతో నిండిపోయి దుర్వాసన వెదజల్లుతున్నాయని, ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మురుగునీరు, వర్షపు నీరు పారుదల కాక గ్రామంలో పలు రోడ్లు జలమయమవుతాయని విమర్శించారు. కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి మురికి నీరు వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలో ఏ గ్రామంలో చూసినా రోడ్లు, డ్రెయినేజీ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు మాత్రం మొద్దు నిద్రలో ఉన్నారని విమర్శించారు. ములుగుందం నుండి పలకూరబండ గ్రామానికి రవాణా సౌకర్యం లేక ప్రజలు, రైతులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు తక్షణమే పలకూరబండ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్యదర్శి దివ్యశ్రీ కి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు నరసింహులు, శివ, ప్రసాదు పాల్గొన్నారు.

ప్రత్యేక కౌంటర్‌లను ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - ఆస్పరి : ఉపాధ్యాయులు మరియు పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటు హక్కు నమోదు చేసుకోవడానికి తహ సిల్దార్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని సిపిఐ మండల కార్యదర్శి విరుపాక్షి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదే శాల మేరకు మండల తహసిల్దార్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయాలలో ఉపాధ్యాయులు,పట్టభద్రులు ఓటు హక్కు నమోదు చేసుకోవడానికి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ మండల అధికారులు పట్టించు కోకపోవడం చాలా దారుణం అన్నారు.సిపిఐ పట్టణ కార్యదర్శి కృష్ణమూర్తి, మండల నాయకులు బ్రహ్మయ్య, రామాంజిని, ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి యువరాజ్ పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - పత్తికొండ : ఈనెల 4వ తేదీన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తలపెట్టిన మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, కళాశాల ప్రిన్సిపాల్ మాధురిలు పిలుపు నిచ్చారు.మంగళవారం ఎమ్మెల్యే స్వగృహంలో మెగా జాబ్ మేళా వాల్ పోస్టర్లు ఎమ్మెల్యే చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మాధురి మాట్లాడుతూ పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ, డిప్లమా, ఇంజనీ రింగ్, మొదలగు విద్యార్హతలు ఉన్న నిరుద్యోగులు 18 సంవత్సరాల నుండి 30 సంవత్సరాల వయసు కలిగిన వారు జాబ్ మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు. సర్పంచ్ కొమ్ము దీపిక, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ సోమశేఖర్, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి శ్రీరంగడు, జిల్లా కార్యదర్శి లలితా రామచంద్ర, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

మహానుభావుల త్యాగాలను గుర్తు చేసుకోవాలి

విశాలాంధ్ర - కర్నూల్ లీగల్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఆంధ్ర రాష్ట్రం అవతరణకు కృషి చేసిన పొట్టి శ్రీ రాములు లాంటి ఎందరో మహాను భావులను వారి త్యాగాన్ని స్మరించుకుంటూ పాణ్యం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే టీడీపీ ఇంచార్జి గౌరు చరితారెడ్డి, టీడీపీ నంద్యాల పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు గౌరు వెంకటరెడ్డి రాష్టం కోసం ప్రాణ త్యాగం చేసిన అమరజీవి శ్రీ పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతు మహనీయులు గుర్తుచేసుకోవడం ఎంతో సంతోష కర విషయమన్నారు. ఆంధ్ర రాష్ట్ర అవ తరణ కోసం ప్రణాళి సైతం లెక్కచేయకుండా చిన్న వయసులోనే ప్రాణాలు కోల్పోయారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ పెరుగు పురుషోత్తం రెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, టీడీపీ నాయకులు యశ్వంత్ రెడ్డి,సుదర్శన్ రెడ్డి, వీరేంద్ర, సాయి,దిలీప్ కుమార్,పాల్గొన్నారు.

పోలీసుకు వీక్లీ బెస్ట్ పర్ఫామెన్స్ అవార్డు

విశాలాంధ్ర- కోడుమూరు : కోడుమూరు సర్కిల్ పరిధిలోని పోలీసు స్టేషన్ లో పనిచేస్తున్న కానిస్టేబుల్ కె రామకృష్ణ(పిసి 3560)కు వీక్లీ బెస్ట్ పర్ఫామెన్స్ ప్రశంసాపత్రాన్ని జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ అందజేశారు. మంగళవారం ఉదయం ఈ మేరకు జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ చేతుల మీదుగా రామకృష్ణ ప్రశంస పత్రాన్ని అందజేశారు. ఇటీవల కోడుమూరులో జరిగిన కున్నూరు గ్రామా నికి చెందిన సిద్దన్న హత్య కేసులో సమాచారం సేకరించి, పరారీలో వున్న నిందితుల ఆచూకీ కనుగొనడం తోపాటు నిందితుల అరెస్టు విషయంలో అంకిత భావం, విధుల పట్ల నిబద్ధతతో కృషి చేసి కానిస్టేబుల్ రామకృష్ణ ప్రతిభ కనబరిచారని ఈ సందర్భంగా జిల్లా ఎస్పి అభినందించారు.పోలీసు సిబ్బందిలో వున్న ప్రతిభను గుర్తించి ఇలాంటి అవార్డులు ఇవ్వడం సంతోషించదగ్గ విషయమన్నారు. ప్రశంసపత్రాన్ని అందించి సత్కరించిన ఎస్పికి కానిస్టేబుల్ రామకృష్ణ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

ప్రజల భవిష్యత్తును నిర్ణయించేది ఓటు మాత్రమే

విశాలాంధ్ర-కర్నూలు : ప్రజల భవిష్యత్తును ఐదేళ్లకోసారి వచ్చే ఓటు నిర్ణయిస్తుందని కర్నూలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి టి.జి భరత్ అన్నారు. మంగళవారం నగరంలోని 51 వ వార్డులో తెలుగుదేశం పార్టీ సభ్యత్వం కార్యక్రమంతో పాటు ఒక్కరోజు అన్న క్యాంటిన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్లమెంటు అధ్యక్షుడు సోమిశెట్టితో కలిసి టిజి భరత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా టిజి భరత్ మాట్లాడుతూ ఎలాంటి నాయకుడు కావాలో ప్రజలే ఆలోచించుకోవాలని సూచించారు. గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి తేడా ఏంటో తెలుసుకోవాలని చెప్పారు. ఇక పేదలకు అన్నం పెట్టే అన్న క్యాంటిన్లను ఈ ప్రభుత్వం ఎందుకు తీసివేసిందో ప్రశ్నలా మిగిలిపోయిందన్నారు. కర్నూలు ప్రజలకు ఎంతో సేవ చేస్తున్నామని నగరం అభివృద్ధి కావాలంటే సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. వార్డు ఇంచార్జి గణేష్, క్లస్టర్ ఇంచార్జి బొల్లెద్దుల రామక్రిష్ణ, నగర అధ్యక్షుడు గున్నామార్క్, కార్పొరేటర్ పరమేష్, ఇతర వార్డుల ఇంచార్జీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి

విశాలాంధ్ర-సి.బెళగల్ : మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లోని లబ్దిదారులకు మంజూరు అయిన గృహాలను త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి దుర్గా ప్రసన్న బాబు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల అభివృద్ధి కార్యాలయంలో ఎంపీడీవో ఏసీ రాముడు అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుండి మంజూరైన గృహాల ను లబ్దిదారులతో డిసెంబర్ 21వ తేదిలోపల కచ్చితంగా గృహాలను పూర్తి చేయాలని ఆయనఅధికారులకు సూచించారు.సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగ కుండా వారికి అందుబాటులో ఉండి వారి పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆయన సచివాలయ ఉద్యోగులకు సూచించారు. ఎంపీడీవోతో ఈఓఆర్‌డి సందీప్, హౌసింగ్ఏఈసుమంత్, ఏపిఎం వెంకటస్వామి, ఏపీఓ లక్ష్మన్న, ఈసీలు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటు హక్కును నమోదు చేసుకోవాలి

విశాలాంధ్ర-కోడుమూరు : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను శాసించే ఓటు హక్కును నవంబర్ 7వ తేదీలోపు నమోదు చేసుకోవాలని వామపక్షాలు బలపరుస్తున్న పిడిఎఫ్ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజును ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డిని గెలిపించాలని కోరుతూ కోడుమూరు,గూడూరు,సి. బెలగల్ మండలాలలో సిపిఐ, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరుద్యోగులతో కలసి సోమవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఎన్నికల జిల్లా కన్వీనర్ జి.రంగన్న ,జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరాములు మాట్లాడుతూ 2023లో జరగనున్న పశ్చిమ రాయలసీమ పట్టభద్రల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు నీతికి నిజాయితీకి మధ్యన జరగనున్న ఎన్నికలని, ధనికులు, సామాన్యులు, సేవాపరులకు మధ్య జరగనున్న ఎన్నికలన్నారు.గతంలో ఎమ్మెల్సీగా ఎన్నికైన పాలకులు మారిన మనస్థితిగతులు మార్పు కాలేదన్నారు. మన సమస్యలు గాలికి వదిలేసారని, సమస్యలు తెలిసిన పోతుల నాగరాజును, కత్తి నరసింహారెడ్డిని గెలిపించాలన్నారు. నవంబర్ 7వ తేదీ లోగా మీ ఓటు హక్కును నమోదుచేసుకుని మొదటి ప్రాధాన్యత ఓటు వేసి వారిని గెలిపించాలన్నారు. గెలిస్తే చట్టసభల్లో అందరి గొంతకై,సమస్యలపై పోరాడుతారన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణ సీపీఐ కోడుమూరు పట్టణ,మండల ప్రధాన కార్యదర్శిలు రాముడు,రాజు ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి నాయకులు దేవేంద్రగౌడ్, సిద్దు, ఉదయ్,మహేష్ పాల్గొన్నారు.

ఘనంగా క్యాబినెట్ ఇన్స్టాలేషన్ వేడుకలు

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : స్థానిక వెంకటరమణ కాలనీలోని నారాయణ పాఠశాలలో క్యాబినెట్ ఇన్స్టాలేషన్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న షేక్షావలి సిఐ మాట్లాడుతూ విద్యార్థులలో నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవడం కోసం ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు.పాఠశాలలోని ఇలాంటి విధులను నిర్వహించడం వల్ల భవిష్యత్తులో మంచి పౌరుడిగా రూపుదిద్దు కోవచ్చు అని అన్నారు, నారాయణ విద్యాసంస్థల ఏజీఎం రమేష్ మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతోపాటు నాయకత్వ లక్షణాలు ఎంతో ముఖ్యమని అందుకోసం పాఠశాలలో క్యాబినెట్ ఏర్పాటు చేసి విద్యార్థు లకు కొన్ని బాధ్యతలను అప్పజెప్పడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నా పాఠశాలల స్టేట్ కోఆర్డినేటర్ భాగ్యలక్ష్మి ,పాఠ శాల జోనల్ కోఆర్డినేటర్, రెహానా కార్యాన్ పాఠశాల ప్రిన్సిపాల్, దినేష్ కుమార్, ఆర్ఐ వేణుగోపాల్ సాఫ్ట్ స్కిల్ ట్రైనర్ వర్ధిని, వైస్ ప్రిన్సిపల్ దివ్య, అకాడమిక్ డిన్ సత్యప్రసాద్ పాల్గొని ఎన్నికైన విద్యార్థులను అభినందించారు.